సాక్షి అనకాపల్లి

మంగళవారం । 14 । మార్చి । 2023



నేడు క్రికెట్ టికెట్ల విక్రయం

ఈనెల 19న విశాఖలో జరగనున్న వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్లను మంగళవారం విశాఖలో విక్రయించనున్నారు. 8లో



చిరుధాన్యాలతో అపు'రూపాలు'

వృత్తిరీత్యా విజయ్‌కుమార్ రైల్వే ఉద్యోగి. చిరుధాన్యాలతో అపురూప చిత్రాల వేస్తూ ఆకట్టుకుంటున్నారు. 8లో



గ్లకోమా స్క్రీనింగ్

విశాఖ: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గ్లకోమా పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

అనకాపల్లి టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా వృత్తి విద్యాధికారి బి.సుజాత సోమవారం పేర్కొన్నారు. జిల్లాలోని 34 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో డిజిటల్ వాచీలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

ఇంటర్ విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 15వ తేదీ నుంచి అన్ని రూట్లలో పరీక్షల సమయంలో బస్సులు నడుపుతున్నట్లు ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) జిల్లా అధికారి కె.పద్మావతి సోమవారం పేర్కొన్నారు. విద్యార్థులెవరైనా రాయితీ బస్ పాస్ కలిగి ఉన్నట్లయితే వారు ఆ రూట్‌లో వచ్చే మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో నామమాత్రపు చార్జీతో ప్రయాణించవచ్చని తెలిపారు. పరీక్షల సమయంతోపాటు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా బస్‌పాస్‌లు కలిగిన ఉన్న విద్యార్థులను ఆ బస్సుల్లో అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌క్యూఏఎస్ బృందం ఎన్టీఆర్ వైద్యాలయం సందర్శన



ఆస్పత్రి ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న బృందం

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్–ఎన్‌క్యూఏఎస్) బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం ప్రతినిధులు డాక్టర్ కె.నారాయణ (కేరళ), డాక్టర్ దీపక్‌నాందే డాంగేర్ (నాగపూర్), డాక్టర్ సవిత (ఢిల్లీ) మాట్లాడుతూ మూడు రోజులపాటు ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి, ఎన్‌క్యూఏఎస్‌కు నివేదిక అందజేస్తామన్నారు. బృందం ఇచ్చిన నివేదికను అనుసరిస్తూ కేంద్రం ఒక్కో బెడ్‌కు రూ.10 వేల వంతున 3 సంవత్సరాలపాటు ఆస్పత్రి అభివృద్ధికి నిధులు అందిస్తుందని వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. బృందం నివేదికకు అనుగుణంగా లక్ష్య బృందం ఆస్పత్రి అభివృద్ధికి మరో రూ.10 లక్షలతోపాటు గుర్తింపు సర్టిఫికెట్ జారీ చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో భారతి, వివిధ విభాగాల వైద్యులు ఉన్నారు.

కార్గోలో అనకాపల్లి డిపోకు ప్రథమ స్థానం



గ్యారేజీని పరిశీలిస్తున్న ఈడీ రవికుమార్

అనకాపల్లి టౌన్: ప్రజారవాణాశాఖ విజయనగరం జోన్ పరిధిలో కార్గో రవాణాలో ఈ ఏడాది అనకాపల్లి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ చెప్పారు. స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన సోమ వారం సాయంత్రం సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు చెందిన 20 బస్సులకు కాలం చెల్లడంతో విజయనగరం వర్క్‌షాపుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నా రు. వీటి స్థానంలో నూతనంగా 8 బస్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. మిగిలిన బస్సులను ఈనెలాఖరుకు అప్పగిస్తామన్నారు. జిల్లా ప్రజారవాణాశాఖాధికారి కె.పద్మావతి, డిపో మేనేజర్ ఎస్.సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఉరలోవ కొండపై కార్చిచ్చు



కాలిపోయిన జీడిమామిడి తోట

రావికమతం : కొమిర గ్రామం వద్దనున్న ఉరలోవ కొండపై కార్చిచ్చు అంటుకుంది. మూడు రోజులుగా మంటలు ఎగసిపడుతున్నాయి. కొండపైకి రహదారి సౌకర్యం లేకపోవడం, రైతులు రక్షణ ఏర్పాట్లు చేసే వీల్లేక మంటలు అదుపులోకి రాలేదు. కాలుతూనే ఉన్నాయి. ఆ కొండపై సుమారుగా 80 మంది రైతులు వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే అప్పికొండ చినబ్బాయి, టి.కల్యాణం, అప్పారావు, ధర్మరాజు, తుర్రె అప్పారావు తదితర 15 మంది రైతులకు చెందిన 30 ఎకరాల్లో తోటలు కాలిపోయాయి.

ఓటెత్తిన పట్టభద్రులు

ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే భారీ సంఖ్యలో కేంద్రాలకు తరలివచ్చి ఓటు ప్రాధాన్యతను తెలిపారు. బ్యాలెట్ పేపర్ భారీ సైజులో ఉండటంతో ఓటు వేయడానికి ఒక్కో ఓటరుకు చాలా సమయం పట్టింది. అయినప్పటికీ పట్టభద్రులు సహనం కోల్పోలేదు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో నిల్చుని ఓటేసి కానీ వెనుదిరగలేదు. పురుషులతోపాటు మహిళా పట్టభద్రులూ పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.21 శాతం పోలింగ్ నమోదైంది.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల జోరు
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద రద్దీ
- సాయంత్రం 4 తర్వాత భారీ క్యూలు
- ఆవరణలో ఉన్న అందరికీ ఓటేసే అవకాశం
- 16న కౌంటింగ్, గెలుపుపై ఎవరి అంచనాలు వారివే..
- 69.21 శాతం పోలింగ్ నమోదు



చోడవరం పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 5 గంటలకు బారులు తీరిన ఓటర్లు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర **పట్టభద్రుల ఎమ్మెల్సీ** ఎన్నికల పోలింగ్ సోమవారం ప్ర**శాంతంగా ముగిసింది**. పట్టభద్రులు భారీగా కదిలి**రావడంతో అంచ**నాలకు మించి రికార్డుస్థాయిలో **ఓటింగ్ నమోదైంది.** ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న **37 మంది అభ్యర్థుల** భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఆది నుంచి ఓటమి భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్న టీడీపీ, బీజేపీ శ్రేణులు.. పోలింగ్ రోజున కూడా అదే తీరుని కనబరిచారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనేక పోలింగ్ బూత్‌ల వద్ద తమ మద్దతు అభ్యర్థుల ఫొటోలు, పేర్లుతో ఉన్న కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో 69.21 శాతం పోలింగ్ నమోదవ్వగా.. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 69.37 శాతం పోలింగ్ నమోదైంది. మంత్రి అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో సహా ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఈనెల 16న కౌంటింగ్ జరగనుంది.

మందకొడిగా మొదలై..

సోమవారం ఉదయం 8 గంటల నుంచి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. 9 గంటలకు కార్యాలయాలకు, విధులకు వెళ్లే ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో ఓటింగ్ క్రమంగా ఊపందుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు బారులు తీరారు. పర్మిషన్స్ తీసుకొని ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు తరలిరావడంతో మధ్యాహ్నం నుంచి ఓటింగ్ ఒక్కసారిగా ఊపందుకుంది. అనంతరం.. సాయంత్రం సమయంలోనూ అదే రీతిలో పట్టభద్రులు ఓటు హక్కు **వినియోగించుకునేందుకు కేంద్రాలకు చేరుకున్నారు. నిబంధనల మేరకు 4 గంటలలోపు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు. వారికి ప్రత్యేకంగా నంబర్లు కేటాయించి.. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు.**



నక్కపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న వికలాంగుడు కాశీరావు

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఓటింగ్‌ను వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు. పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఓటర్లతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

ప్రతిపక్షాల ఉల్లంఘనలే..

సాధారణంగా ఎన్నికలు జరిగినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కాస్త దూకుడుగా వ్యవహరిస్తుంటుంది. కానీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పూర్తి విరుద్ధంగా కనిపించింది. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, మద్దతుదారులు సంయమనంగా వ్యవహరించారు. ఓటర్లకు స్లిప్పులు అందించడం.. వారికి పోలింగ్ బూత్‌ల వివరాలు తెలపడం వరకు మాత్రమే పరిమితమయ్యారు. కానీ.. టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ మాత్రం ఏ పోలింగ్ స్టేషన్ వద్ద చూసినా ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. తమ అభ్యర్థికి ఓటు వేయాలంటూ.. టీడీపీ ఏజెంట్లు, అనుచరులు ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు.

స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి.. పోలీసు భద్రత నడుమ ఎన్నికల అధికారులు, సిబ్బంది కలిసి ప్రత్యేక వాహనాల్లో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆయా జిల్లాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు.

నర్సీపట్నంలో స్వల్ప ఉద్రిక్తత

నర్సీపట్నంలో పోలింగ్ చివరిలో టీడీపీ శ్రేణులు అతిగా వ్యవహరించడంతో పోలింగ్ కేంద్రం బయట ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే గణేష్ ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చి కారు ఎక్కుతుండగా తెలుగుదేశం కార్యకర్తలు రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే కారు దిగి వారి వైపు వచ్చారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

రెండో ప్రాధాన్యత ఓటుపై తప్పుడు ప్రచారం

నక్కపల్లిలో ఒక ప్రిసైడింగ్ అధికారి చేసిన ప్రకటన ఓటర్లను ఆందోళనకు గురిచేసింది. నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 185 పోలింగ్ కేంద్రంలో పీవో ప్రసాద్ మొదటి ప్రాధాన్యత ఓటుతోపాటు రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని, అలా వేయకపోతే ఓటు చెల్లదని చెప్పడంతో ఓటర్లు వైఎస్సార్‌సీపీ నేతల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పీవో వైఖరిని నిలదీశారు. దీంతో ఆయన చల్లగా జారుకున్నారు.



చీడికాడలో పోలింగ్‌పై కార్యకర్తలను ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



కశింకోటలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అనకాపల్లిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంపీ సత్యవతి

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో పోలైన ఓట్లు ఇలా..

జిల్లా పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
శ్రీకాకుళం	52,256	37,417	71.60
విజయనగరం	58,502	43,862	74.98
పార్వతీపురం మన్యం	18,520	13,619	73.54
అల్లూరి సీతారామరాజు	11,525	8,362	72.56
విశాఖపట్నం	1,05,697	65,472	61.94
అనకాపల్లి	42,714	31,442	73.61
మొత్తం	2,89,214	2,00,174	69.21



రిటర్నింగ్ అధికారి మల్లికార్జున





ఓటు వేసేందుకు క్యూలో వెళుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
సబ్బవరంలో ఓటు వేసిన జేసీ కల్పనాకుమారి



అనకాపల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లి జిల్లాలో 73.61%

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 73.61 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం ఓట్లు 42,714 కాగా 31,442 మంది ఓటు వేశారు. అందులో పురుషులు 20,967మంది, మహిళలు 10475మంది ఉన్నారు. పోలింగ్ మధ్యాహ్నం వరకూ మందకొడిగా సాగినా.. ఆ తర్వాత నుంచి పెరుగుతూ వచ్చింది. ఓటు వేసేందుకు జనం బారులు తీరారు. పోలింగ్ సమయం 4 గంటలకు ముగిసినప్పటికీ ఓటర్లు క్యూలో ఉండడంతో వారికి ప్రత్యేకంగా నంబర్లు కేటాయించి.. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా కొన్ని కేంద్రాల్లో జనరేటర్లు ఏర్పాటు చేశారు. పాయకరావుపేట, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో రాత్రి 9 గంటలు దాటిపోయింది. చోడవరంలో పోలింగ్ బూత్‌లు రెండే ఉండడంతో ఒక్కో కేంద్రంలో సుమారు 1400 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగతా ఓటర్లతోపాటు క్యూలో నిల్చుని ఆయన ఓటు వేశారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అదే కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జేసీ కల్పనాకుమారి సబ్బవరంలో ఓటు వేశారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి పరిశీలన

ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల ముందు నుంచే పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, జేసీ కల్పనాకుమారి పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలో జరుగుతున్న పోలింగ్ పరిస్థితిని గమనిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు ఇచ్చారు. నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లిలో టీడీపీ కార్యకర్తలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు.

జిల్లాలో పోలింగ్ సాగిందిలా....

10 గంటలకు	8.83 శాతం
12 గంటలకు	23.05 శాతం
2 గంటలకు	37.02 శాతం
4 గంటలకు	54.20 శాతం
మొత్తం	73.61 శాతం

మండలాల వారీగా పోలింగ్ శాతం

పాయకరావుపేట నియోజకవర్గం 74.86		నర్సీపట్నం నియోజకవర్గం 74.42		మాడుగుల నియోజకవర్గం 75.2		అనకాపల్లి నియోజకవర్గం 83.27		యలమంచిలి నియోజకవర్గ 80.42		చోడవరం నియోజకవర్గం 73.07	
పాయకరావుపేట	74.8	నాతవరం	74.66	మాడుగుల	73	అనకాపల్లి	76.64	రాంబిల్లి	83	చోడవరం	65.28
కోటవురట్ల	81.8	నర్సీపట్నం	71.02	కె.కోటపాడు	75	కశింకోట	89.90	అచ్యుతాపురం	81.3	బుచ్చియ్యపేట	70.6
ఎస్.రాయవరం	66.57	మాకవరపాలెం	78	దేవరాపల్లి	77.33			యలమంచిలి	81.81	రావికమతం	76.42
నక్కపల్లి	76.29	గొలుగొండ	74.03	చీడికాడ	75.81			మునగపాక	74.74	రోలుగుంట	80

నులిమేద్దాం!

దేశంలో 19 ఏళ్లలోపు వయసున్న పిల్లలు సాయిల్ ట్రాన్స్‌మిటెడ్ హెల్మిన్స్(ఎస్‌టీహెచ్) ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల వల్ల ఎక్కువగా రక్తహీనతకు గురవుతున్నారు. నేషనల్ హెల్త్ పోర్టల్(ఎన్‌హెచ్‌పీ) నివేదిక మేరకు ఆరు మాసాల నుంచి ఆరేళ్ల వయసున్న ప్రతి 10 మంది పిల్లల్లో ఏడుగురికి రక్తహీనత ఉంది. దీన్ని నియంత్రించడానికి 2015 నుంచి ఏటా ఫిబ్రవరి, ఆగస్టులో నులిపురుగుల నివారణ (డీవార్మింగ్) కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతున్నారు. అందులో భాగంగా నేడు(మంగళవారం) జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల్ని నివారించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు.

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 60 శాతం చిన్నారుల్లో రక్తహీనతకు నులిపురుగే కారణం
- జిల్లాలో 3,29,791 మందికి మాత్రలు వేయాలని లక్ష్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : పెరుగుతున్న రక్తహీనత కేసులతో జనం అల్లాడిపోతున్నారు. ఎంత మంచి ఆహారం తీసుకున్నా.. రక్తహీనతకు గురయ్యేవారి కారణాలు తెలిస్తే మన మీద మనకే జాలేస్తుంది. కొద్ది పాటి నిర్లక్ష్యం, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత లోపించి చిన్నారులకు, గర్భిణులకు శాపంగా మారుతోంది. కరోనా తర్వాత శుభ్రతపై కాస్త దృక్పథం మారినా.. పిల్లల్లో మాత్రం నులి పురుగుల వ్యాప్తికి మన నిర్లక్ష్యమే కారణమవుతోంది. పిల్లల్లో రక్తహీనతకు కారణమవుతున్న నులిపురుగుల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వం సన్నద్ధమయింది.

నులిపురుగులతో నష్టాలు

నులిపురుగులు పేగుల్లోని రక్తాన్ని పీల్చి, వృద్ధి చెందుతాయి. దీంతో రక్తహీనత కలిగి, నీరసించిపోతారు. ఆయాసం, దగ్గుతో ఇబ్బంది పడతారు. పిల్లల బరువుతోపాటు ఎదుగుదల తగ్గిపోతుంది. చర్మంపై దద్దుర్లు రావొచ్చు. తరచూ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, ఆకలి మందగించడం తదితర లక్షణాలు వేధిస్తాయి. చదువులో ఏకాగ్రత లోపించి, నేర్చుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వీటిని చాలా వరకు నివారించవచ్చు.

నులిపురుగుల వ్యాప్తి కారకాలు

- కలుషిత, ఈగలు వాలిన పదార్థాలు తినడం వల్ల పొట్ట, పేగుల్లోకి నులిపురుగులు చేరే అవకాశాలు ఎక్కువ.
- వ్యక్తిగత పరిశుభ్రత లోపించి చేతి గోళ్ల ద్వారా కూడా ఇవి వ్యాపిస్తాయి.
- బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, చెప్పుల్లేకుండా మరుగుదొడ్ల వాడకం ద్వారా శరీరంలోకి నులిపురుగులు ప్రవేశిస్తాయి.
- అపరిశుభ్ర ఇంటి పరిసరాల్లో పిల్లలు ఆడుకునేటపుడు వాటి లార్వాలు జీర్ణకోశంలోకి ప్రవేశించి నులిపురుగులు వ్యాపిస్తాయి.
- మన దేశంలో 50–60 శాతం మంది ప్రధానంగా ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగుల వల్లే రక్తహీనకు గురవుతున్నట్లు అంచనా.



నులిపురుగు నివారణ మాత్రలు



నులిపురుగులు

మాత్రల డోసేజ్

పిల్లల్లో అనారోగ్యానికి కారణమవుతున్న నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14(మంగళవారం) నులి పురుగుల నివారణ దినోత్సవం పేరిట ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రను అందించనుంది. ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్ల నిండి 19 ఏళ్ల వయసున్న వారికి స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులకు 200 మి.గ్రా.(సగం)మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 మి.గ్రా. మాత్ర చొప్పున మింగాల్సి ఉంటుంది.

జిల్లాలో పంపిణీ నేడు

అనకాపల్లి జిల్లాలో స్కూళ్లు, కాలేజీలు కలిపి ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్నవారు 3,29,791 మంది పిల్లలున్నారు. వీరందరికీ మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సుమారు 1500 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది రంగంలోకి దిగనున్నారు. ఈ సారి విద్యాశాఖను సైతం భాగస్వామ్యం చేశారు. గతంలో నేరుగా ఆశా కార్యకర్తల ద్వారా మాత్రలను పాఠశాలల్లో వేసేవారు. ఇప్పుడు విద్యాశాఖ సిబ్బంది ద్వారా అందించేందుకు విద్యాసంస్థలకు రెండు రోజులు ముందుగానే మాత్రల్ని చేర్చారు. తల్లిదండ్రులకు, పిల్లలకు వీటిపై ముందుగానే అవగాహన కల్పించేలా వైద్యశాఖ చర్యలు తీసుకుంది.

వీరికి మాత్రలొద్దు

పూర్తిగా అనారోగ్యంతో ఉన్న వారు ఆల్బెండజోల్ మాత్ర వేసుకోరాదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే వేసుకోవాలి. ఏడాదిలోపు వయసున్నవారు, గర్భిణులు, బాలింతలు, లివర్, ఉదర, గుండె సంబంధిత వ్యాధులున్నవారు ఈ మాత్రల్ని వేసుకోరాదు.

మాత్రలు తప్పనిసరి



అనకాపల్లి జిల్లాలో అన్ని పాఠశాలలకు ఈ మాత్రలు ఇప్పటికే సరఫరా చేశాం. ఖచ్చితంగా ప్రతి పిల్లవాడు ఈ మాత్ర వేసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా.. వైద్య సిబ్బంది పక్కనే అందుబాటులో ఉంటుంది. నులి పురుగుల నియంత్రణకు తల్లిదండ్రులు సహకరించాలి. పిల్లలతో మాత్రల్ని మింగించాలి.

– డాక్టర్ హేమంత్ కుమార్, డీఎంహెచ్‌వో

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఓటు గల్లంతు

- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



ఓటు గల్లంతు కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: తన ఓటు గల్లంతు కావడంపై ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చోడవరంలోని యూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 169 పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు ధర్మశ్రీ వచ్చారు. పోలింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటర్ల జాబితాను పరిశీలించగా ఆయన పేరు లేదు. తన స్వగ్రామమైన చోడవరం మండలం అంభేరుపురంలో ఓటు హక్కు నమోదుకు వివరాలు అందించానని, తీరా జాబితాలో తన పేరున ఓటు నమోదు కాలేదన్నారు. తనతోపాటు తన కుటుంబసభ్యులైన 13మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానన్నారు.


దేవరాపల్లిలో ఓటు వేసేందుకు దివ్యాంగ ఉపాధ్యాయుడిని తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు


దేవరాపల్లిలో సిరా గుర్తు చూపిస్తున్న సీనియర్ ఓటరు అప్పలనాయుడు


కె.కోటపాడులో సహాయకుడితో అంధత్వ ఉపాధ్యాయుడు


మాడుగులలో పోలింగ్ కేంద్రానికి వస్తున్న దివ్యాంగుడు


నర్సీపట్నంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


రావికమతంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


యలమంచిలిలో ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు


పటిష్ట బందోబస్తు మధ్య యలమంచిలిలో బ్యాలెట్ బాక్సులను విశాఖ తరలిస్తున్న పోలింగ్ సిబ్బంది, పోలీసులు


యలమంచిలిలో సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చిన ఓటరును అనుమతించని పోలీసులు


యలమంచిలిలో చంటిబిడ్డతో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వచ్చిన దంపతులు

పోలింగ్ తీరును పరిశీలించిన అరకు ఎంపీ


గొలుగొండలో నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీరును గొలుగొండలో అరకు ఎంపీ జి. మాధవి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అడిగి తెలుసుకున్నారు. సోమవారం వారు వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశమై ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అధిక మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, నేను సైతం ట్రస్టు చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రెండో ప్రాధాన్యత ఓటుపై పీవో ఓవర్ యాక్షన్

- వైఎస్సార్‌సీపీ నేత నిలదీత

నక్కపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌లో ప్రిసైడింగ్ అధికారి ప్రకటన ఓటర్లను ఆందోళనకు గురి చేసింది. రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని, లేకపోతే చెల్లదని చెప్పడంతో వైఎస్సార్‌సీపీ నేతల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పీవోను నిలదీశారు. నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలోని 185 కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడ పీవో ప్రసాద్ వ్యవహార శైలిపై నిలదీశారు. రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని, ఏ అభ్యర్థికి ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎస్‌ఐ శిరీషా జోక్యం చేసుకుని వివాదం సద్దుమణిగించారు. అయినప్పటికీ పలువురు ఓటర్లు అడిగిన ప్రశ్నలకు పీవో నీళ్లు నమిలారు. దీనిపై క్లారిటీ ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఖాళీ బ్యాలెట్ పేపర్ కూడా వేయొచ్చని చిర్రుబుర్రులాడుతూ లోపలికి వెళ్లిపోయారు.


నక్కపల్లి పోలింగ్ బూత్ వద్ద పీవోను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వీసం

నిత్యం అలెప్పీ-ధన్‘బాధ’లే

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : ధన్‌బాద్ - అలెప్పీ (13351), అలెప్పీ - ధన్‌బాద్ (13352) ఈ రెండు రైళ్లు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. రిజర్వుడు కంపార్ట్‌మెంట్‌లో రిజర్వేషన్ చేయించుకున్న వారికి కనీసం నిల్చోడానికి కూడా చోటు ఉండదు. అదీ ఈ రైలు ప్రత్యేకత. రోజూ విశాఖ ఇదే పరిస్థితి. రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు ఇబ్బందులు తప్పవు. ఈ రైలు రద్దీని బట్టి ప్రయాణికులు దాదాపు 3 నెలల ముందు నుంచే రిజర్వేషన్ చేయించుకుంటారు. అయినా సరే ప్రయాణించేటప్పుడు అవస్థలు తప్పడం లేదు. రిజర్వుడు కోచ్‌ల నుంచి సాధారణ ప్రయాణికులను రోజూ దింపడం రైల్వే పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది.


విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బొకారో ఎక్స్‌ప్రెస్ వద్ద పరిస్థితి

నేడు వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయం

- నగరంలో మూడు కౌంటర్లు

విశాఖ స్పోర్ట్స్: భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈనెల 19న వైఎస్సార్ స్టేడియంలో జరగనున్న వన్డే మ్యాచ్ టికెట్లను మంగళవారం విశాఖలో ఏర్పాటు చేసిన మూడు కౌంటర్లలో విక్రయించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా విక్రయించిన టికెట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోగా స్థానికంగా అభిమానుల కోసం వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్, కొత్తరోడ్‌లోని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్ గాంధీ క్రీడాప్రాంగణంలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. టికెట్ కనీస ధర రూ.600లు కాగా రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.6,000ల టికెట్లను ఉదయం 10 గంటల నుంచి విక్రయిస్తారు.

చిరుధాన్యాలతో అపు‘రూపాలు’

- చిత్రవిచిత్రాలతో మెప్పిస్తున్న విజయ్‌కుమార్
- దేశ, విదేశీ ప్రముఖులను మెప్పించిన వైనం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంత్రి అమర్‌నాథ్ (ఫైల్)

ఏయూక్యాంపస్ : వృత్తిరీత్యా అతను రైల్వేలో గ్రేడ్ వన్ టెక్నీషియన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తితో చిత్రకారుడిగా మారారు. విభిన్న రూపాలను హృద్యంగా కుడ్యంపై తీర్చిదిద్దడం అతని ప్రత్యేకత. విశాఖకు చెందిన మోకా విజయ్ కుమార్‌ది చిత్రకళలో అందెవేసిన చేయి. సాధారణ చిత్రకారుడిగా ఉండకుండా తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపును సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తీర్చిదిద్ది శభాష్ అనిపించుకున్నారు.

చిరుధాన్యాలతో చిత్తరువులు

2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రజలకు చిరుధాన్యాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా విజయ్ కుమార్ ఆలోచించారు. సిరిధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. జొన్నలు, అరికలు, గంట్లు, రాగులు, నువ్వులు ఉపయోగించి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన రెడ్డిలతో పాటు, ముఖేష్ అంబాని, ఆనంద్ మహేంద్ర, సత్యనాదెండ్ల, ఆదానీ, నటరాజన్ చంద్రశేఖరన్, సుందర్‌పిచాయ్, అది గోద్రెజ్, కుమార మంగళం బిర్లా, ఎలాన్ మస్క్, టిం కుక్ వంటి అంతర్జాతీయ సంస్థల సీఈవోల చిత్రపటాలను తీర్చిదిద్దారు. ఎటువంటి వర్ణాలు అద్దకుండా కేవలం చిరుధాన్యాల గింజలను ఉపయోగించి ఎంతో ఆకర్షణీయంగా వీటిని తయారు చేశారు. ఒక్కో చిత్రపటం తయారు చేయడానికి పక్షం రోజులకు పైగా పట్టిందని విజయ్ కుమార్ చెప్పారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో..

విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విజయ్ కుమార్ తయారు చేసిన ప్రముఖుల చిత్రపటాలను ప్రదర్శించారు. రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్‌లు వీటిని పరిశీలించి విజయ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటాన్ని స్వయంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజయవాడ తీసుకువెళ్లి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డికి బహూకరించారు.

విదేశాలలో ప్రదర్శనలు

2017లో తానా వారి ఆహ్వానం మీద అమెరికాలో సెయింట్ లూయిస్‌లో విజయ్ కుమార్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. 2019 అట్లాంటాలో చిత్రకళను చిన్నారులకు 45 రోజులు బోధించారు. 2021లో ఆన్‌లైన్‌లో అమెరికా, భారతీయ విద్యార్థులకు చిత్రకళపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. 2022లో న్యూజెర్సీలో తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో ప్రత్యేక ప్రదర్శన, శిక్షణ తరగతులను విజయ్‌కుమార్ నిర్వహించారు. రైల్వే కార్యాలయంలో పలు ప్రాంతాలను తన చిత్రాలతో కళాత్మకంగా గతంలో తీర్చిదిద్దారు.

కొత్తగా ప్రయత్నించా...



ప్రజల్లో అవగాహన కల్పించాలని, చిరుధాన్యాలపట్ల ప్రజల్లో చైతన్యం పెంచే విధంగా ఈ ప్రయత్నించా..కాదేదీ కళలకు అనర్హం అన్న చందంగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తయారు చేశా. వీటిని మంత్రులు వీక్షించి ప్రశంసించారు. భవిష్యత్తులో సమాజానికి సందేశాన్నందించే మంచి చిత్రాలను తీర్చిదిద్దుతా..

– మోకా విజయ్ కుమార్, చిత్రకారుడు

వరిగడ్డితో ట్రాక్టర్ దగ్ధం


వరిగడ్డితో దగ్ధమవుతున్న ట్రాక్టర్

చోడవరం రూరల్ : వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో వరిగడ్డితో పాటు, ట్రాక్టర్ దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో ఇరవై లక్షల రూపాయల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. చోడవరం పట్టణ శివారు అన్నవరం సమీపంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన అద్దెపల్లి పాలకు చెందిన ట్రాక్టర్‌లో అన్నవరం గ్రామానికి చెందిన కందుల వెంకటరావు వరిగడ్డిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ అన్నవరం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతానికి వచ్చేసరికి ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి విద్యుత్ తీగలను తాకింది. దీంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి నిప్పురవ్వలు రాలడంతో ఎండిఉన్న వరిగడ్డికి నిప్పంటుకుంది. క్షణాల్లో మంటలు ఎగసిపడడంతో ట్రాక్టర్ ఇంజిన్‌ను వేరుచేయడానికి వీలు పడలేదు. ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ట్రాక్టర్ మంటల్లో కాలిపోయింది.

కొత్తపల్లిలో రెండు తాటాకు ఇళ్లు దగ్ధం

- రూ.రెండు లక్షల ఆస్తి నష్టం


సర్వం కోల్పోయిన రాటా మంగ


కట్టుబట్టలతో మిగిలిన శ్రీనివాస్ కుటుంబం

కొయ్యూరు: అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకుల ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. షార్ట్ సర్క్యూట్‌తో ఒకేసారి మంటలు వ్యాపించడంతో ఎండిపోయిన తాటాకుల నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేయడం సాధ్యం కాలేదు. దీని మూలంగా బాధితులు రీమలు శ్రీనివాస్, రాటా మంగలకు చెందిన రెండు ఇళ్లు కాలిపోయాయి. బట్టలు, వంటపాత్రలతో సహా ఇతర వస్తువులు కూడా పూర్తిగా కాలిపోయాయని బాధితులు ఆవేదన చెందారు. రాత్రి సమయం కావడంతో మంటలను అదుపు చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సర్పంచ్ సుర్ల చంద్రరావు తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు.

కారు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి


మృతి చెందిన మహిళ

నక్కపల్లి : జాతీయరహదారిపై ఒడ్డిమెట్ట, గొడిచర్ల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ మహిళను కారు ఢీకొట్టి పరారయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను 108 సిబ్బంది తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించిందని పోలీసులు తెలిపారు. పరారైన కారును పోలీసులు పట్టుకున్నారు. మృతురాలి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు.

తమ్ముడిని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన అన్న

- తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు
- ఆస్తి వివాదమే కారణం


ట్రాక్టర్‌కింద నలిగి ఉన్న బైక్

రావికమతం : అన్నదమ్ముల మధ్య కొన్నాళ్లుగా నలుగుతున్న భూ వివాదం సోమవారం తీవ్ర రూపం దాల్చింది. ఈ వివాదంలో అన్నకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో ఏకంగా బైక్‌పై వస్తున్న తమ్మునిపై ట్రాక్టర్‌తో ఢీకొని హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రగాయాల పాలయిన తమ్ముడిని రావికమతం ఆస్పత్రి నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రావికమతం ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన అన్న మడకా రమణ, తమ్ముడు సింహాద్రినాయుడుకు మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదాలు ఉన్నాయి. పలుమార్లు ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మేడివాడ గ్రామం పనిమీద వచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న సింహాద్రినాయుడును ఎదురుగా ట్రాక్టర్‌పై వస్తున్న అతని అన్న ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో సింహాద్రినాయుడు కింద పడడంతో చేతికి, ఒంటికి తీవ్రగాయాలయ్యాయి. బైక్ ట్రాక్టర్ కింద నలిగిపోయింది. గాయాల పాలైన అతనిని రావికమతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించి ఆపై నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వరకట్న హత్య కేసులో భర్తకు పదేళ్ల జైలు

పాయకరావుపేట : పట్టణంలో గల చాకలిపేటకు చెందిన గోగులపాటి దావీదుకు వరకట్నం వేధింపుల కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ సోమవారం తీర్పు చెప్పినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. 2013లో నిందితుడు తన భార్యను వరకట్నం కోసం వేధించి గొంతు నులిమి చంపినందుకు పెట్టిన కేసులో శిక్ష విధించడం జరిగిందన్నారు. శిక్షతో పాటు 2 వేల రూపాయలు జరిమానా కూడా విధించడం జరిగిందని సీఐ తెలిపారు.

గైస్ ప్రిన్సిపాల్‌కు అంతర్జాతీయ అవార్డు



మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్గనైజ్డ్ రీసెర్చ్ సంస్థ ఆయన్ని ఇంటర్నేషనల్ డిస్టింగ్విష్డ్ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేసింది. ఆన్‌లైన్‌లో ఆయనకు ఈ అవార్డు అందించగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని పోస్టల్ ద్వారా సోమవారం పంపించారు. గతంలో ఆయన గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్ అవార్డులను అందుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్ : మండలంలోని చింతలవీధి పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ శివార్లో సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మృతదేహం అస్తిపంజరం లభ్యమైంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గ్రామ శివార్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు విషయాన్ని పంచాయతీ వీఆర్వో తెలిపారు. వీఆర్వో పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్‌కు సమాచారమిచ్చారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐ లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి అస్తిపంజరం మిగిలిఉంది. ఈ సంఘటనను అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మూడు నెలల క్రితం అదృశ్యమైన కుమ్మరిపుట్టు నివాసి ఉపాధ్యాయుడు పాంగి వెంకటరమణగా కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

నూకాంబిక గరగ ఊరేగింపు



నూకాంబిక గరగ, పాదాలను పూజిస్తున్న భక్తులు

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన కశింకోట నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయం నుంచి గరగలు, అమ్మ వారి పాదాలను అందంగా అలంకరించిన రిక్షాలో నిలిపి సంప్రదాయంగా డప్పులతో గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం గరగ, పాదాలను ఆలయంలో యథావిధిగా నిలిపారు. ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్, వేగి రామరాజుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నేడు

పరవాడ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. 1–19 ఏళ్ల బాలబాలికలందరికీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గవర్ల అనకాపల్లిలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో గంగపరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. దొడ్డి దిలీప్‌కుమార్, పిట్టా శ్రీను నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ ఆనందరావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యక్తిగత సహాయ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
సీఎస్ఐ	సత్యనారాయణస్క్రీన్-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
వాల్తేరు వీరయ్య	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 6,454 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,780	4,010
మొదటి రకం	3,620	3,830
రెండో రకం	3,200	3,750
మూడో రకం	3,140	3,320

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 310 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రశాంతంగా పట్టభద్రుల పోలింగ్



సాయంత్రం 4 గంటల తరువాత క్యూలైన్‌లో ఓటేసేందుకు నిరీక్షిస్తున్న ఓటర్లు



కశింకోటలోని బాలికల పాఠశాలలో ఉదయం బారులు తీరిన ఓటర్లు



గాయపడి నడవలేని స్థితిలో ఓటేసేందుకు వచ్చిన లాలంకొత్తూరుకు చెందిన ఓటరు



ఓటేసేందుకు పిల్లవాడిని ఎత్తుకుని లైన్‌లో నిలుచున్న ఓటరు



అనకాపల్లి గవరపాలెం 195 పోలింగ్‌బూత్ వద్ద పర్యటిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాల్లో భారీగా పోలింగ్ జరిగింది. ఓటు వేసేందుకు జనం బారులు దీరారు. ఇక్కడ 76.64 శాతం పోలింగ్ నమోదైంది. 194 పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సామాన్య ఓటర్‌లా క్యూలైన్‌లో నిల్చుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే బూత్‌లో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ఓటు వేశారు. ఎస్పీ గౌతమి సాలి పలు పోలింగ్ కేంద్రాల బందోబస్తును స్వయంగా పరిశీలించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి పలు పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ పర్యవేక్షించారు.

కశింకోట : స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ సుమారు గంటన్నర ఆలస్యంగా కొనసాగింది. బ్యాలెట్ పేపర్ 37 మంది అభ్యర్థులతో ఉండటం, అభ్యర్థులను ఎంపిక చేసుకుని ఓటు వేయడానికి ఓటరు ఎక్కువ సమయం తీసుకోవాల్సి రావడంతో ఓటింగ్ ఆద్యంతం మందకొడిగా సాగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ 9 గంటల నుంచి ఊపందుకుని సాయంత్రం వరకు కొనసాగింది. నిర్దిష్ట సమయం ప్రకారం సాయంత్రం 4 గంటలకు ముగియాల్సిన పోలింగ్, క్యూలైన్లలో ఓటర్లు సమయానికి ముందే వచ్చి నిల్చోవడంతో 5.30 గంటల వరకు సాగింది.

ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్లు

కశింకోటతోపాటు మండల గ్రామాల నుంచి ఓటర్లు ఉత్సాహంగా కేంద్రాలకు తరలి వచ్చారు. వీరు ఓటు వేయడానికి కేటాయించిన 189, 190 కేంద్రాల ముందు గంటల తరబడి బారులు తీరారు. ఓటేసేందుకు చాలా మంది సుమారు 2 గంటలపాటు నిరీక్షించారు. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా మహిళలతోపాటు పురుష ఓటర్లు ఉత్సాహంగా హాజరయ్యారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఓటర్లు బారులుతీరి ఎన్నికల సిబ్బందికి విరామం లేకుండా చేశారు. కొందరు ఎక్కువ సమయం నిరీక్షించలేక ఇంటి ముఖం పట్టారు. మరికొందరు రెండు, మూడుసార్లు వచ్చి వెళ్లి ఓటింగ్‌లో పాల్గొన్నారు. గాయపడి నడవలేని స్థితిలో ఉన్న లాలంకొత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తితోపాటు, నడవలేని వృద్ధులను ఆటోలో తీసుకొచ్చి పోలీసుల సాయంతో ఓటు వేయించారు. కొందరు పిల్లల్ని ఎత్తుకుని మరీ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.

81 శాతం ఓటింగ్

సాధారణ ఎన్నికలు తలపించే విధంగా 81 శాతం మేర పోలింగ్ జరిగింది. రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,428 మంది ఓటర్లుండగా 1,158 మంది ఓట్లు వేశారు. 189 కేంద్రంలో 788 ఓటర్లకు గాను 82.23 శాతంతో 648 మంది ఓటు వేశారు. వీరిలో 248 మంది మహిళా ఓటర్లున్నారు. అలాగే 190 కేంద్రంలో 670 మంది ఓటర్లుండగా 510(76.11 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 193 మంది మహిళా ఓటర్లున్నారు. 189 పోలింగ్ కేంద్రంలో మొదట్లో పురుష, మహిళా ఓటర్లు ఒకే లైన్‌లో వెళ్లి ఓటు వేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ సురేష్‌నాయుడు పరిశీలించి వేర్వేరు లైన్లను ఏర్పాటు చేసి, ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ చివరి వరకు ప్రశాంతంగా జరిగింది. సీఐ ఎ.రవికుమార్ తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య ఘర్షణ

అయితే పోలింగ్ సమయం చివరిలో టీడీపీ ఏజెంట్లు తరచుగా పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు వచ్చి వెళుతున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అటువంటిది లేదని టీడీపీ శ్రేణులు బదులిచ్చారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య కాస్త వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి జోక్యం చేసుకొని తమ సిబ్బందితో రెండు వర్గాలను చెదరగొట్టి వివాదం ముదరకుండా సద్దుమణిగించారు.

పోలింగ్‌పై మంత్రి గుడివాడ ఆరా

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కశింకోట వచ్చి పార్టీ శ్రేణులతో పోలింగ్ సరళిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ తమ పార్టీ శ్రేణులను కలిశారు.

దుకాణాల మూసివేత: ఎమ్మెల్సీ ఎన్నికలు దృష్ట్యా పోలింగ్ కేంద్రాలకు ఇరువైపులా ఉన్న దుకాణాలను పోలీసులు ముందు జాగ్రత్తగా మూసివేయించారు. అలాగే పోలింగ్ కేంద్రాల ముందు రోడ్డు మీదుగా వాహనాలు వెళ్లకుండా నిరోధించారు.

• పోలింగ్ కేంద్రంలో ముందు జాగ్రత్తగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి సేవలందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో మందులను, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఓటర్లు అనారోగ్యానికి గురైతే సేవలందించడానికి శిబిరాన్ని నిర్వహించారు.

పెందుర్తిలో 63.07 శాతం నమోదు

పెందుర్తి : మండలంలో ఐదు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 9 బూత్‌లలో పోలింగ్ నిర్వహించారు. మండలంలో 63.07 శాతం పోలింగ్ నమోదైంది.. మొత్తం 9811 మందికి ఓటర్లకు గాను 6188 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 3415మంది పురుషులు, 2773 మంది మహిళలు ఉన్నారు. వేపగుంట జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ బూత్ 279లో సాయంత్రం 6 గంటల వరకు, 280 పోలింగ్ బూత్‌లో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరిగింది. పెందుర్తి జెడ్పీ హైస్కూల్లో కూడా సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆయా పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆనంద్‌కుమార్ పర్యవేక్షించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పలు కేంద్రాలను సందర్శించారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పర్యవేక్షించారు.

పరవాడలో 71.12 శాతం పోలింగ్

పరవాడ: పరవాడలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 2102 ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి పరవాడ, ఉక్కునగరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1495 ఓట్లు పోలవగా 71.12 శాతంగా నమోదైంది. పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో రెండు, ఉక్కునగరం జ్యోతి బాల విహార్ పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు కొంత మందకొడిగా సాగినప్పటికీ ఆ తర్వాత ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ వేడిమికి ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. పోలింగ్ సందర్భంగా పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనకాపల్లి ఎస్పీ గౌతమిశాలి, ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ పి.శ్రీనివాసరావులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ పి.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఎస్‌ఐలు మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, దగ్గరుండి ఓటింగ్ సరళిని సమీక్షించారు.

సబ్బవరంలో 68.66 శాతం నమోదు

సబ్బవరం: సబ్బవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు 200, 200ఎలలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1,899 మంది ఓటర్లకు గాను 1,304 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 68.66 పోలింగ్ శాతం నమోదయిందని ఏఆర్‌వో బి. సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి 200ఎ పోలింగ్ బూత్‌లో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ సరళిని అధికారులను, స్థానిక పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు.



సబ్బవరంలో ఎంపీపీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన పట్టభద్రులు



చిన్నారిని ఎత్తుకుని ఓటేసేందుకు వస్తున్న మహిళా ఓటరు



పెందుర్తిలో ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేస్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రం వద్ద ఉదయాన్నే బారులు తీరిన మహిళా ఓటర్లు



కశింకోట బాలికల పాఠశాల వద్ద సీఐ రవికుమార్ పర్యవేక్షణ



కశింకోటలో ఎమ్మెల్సీ ఎన్నికలతో మూతపడిన దుకాణాలు



ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

నేడు గంగ పరదేశమ్మ తల్లి పండగ

ఆకట్టుకున్న వాలకాలు



గవర్ల అనకాపల్లిలోని గంగ పరదేశమ్మ తల్లి



వాలకాలు ప్రదర్శిస్తున్న గ్రామ యువత

మునగపాక : గవర్ల అనకాపల్లిలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వాలకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పెళ్లిగోల(ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడు), నూకాలమ్మ అమ్మవారి చీరల అమ్మకం వంటి వాటిపై వాలకాలు నిర్వహించారు. ఆళ్ల రమణావు, శివాజీ, మహేష్, రాజు తదితరుల ఆధ్వర్యంలో ఈ వాలకాల కార్యక్రమం నిర్వహించారు. వాలకాలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు స్పందన



కోటవురట్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

కోటవురట్ల : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. కోటవురట్లలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య అంశాలు, వైద్యపరీక్షలపై వారికి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వైద్య సేవలు చేరువలో ఉండాలనే లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు ఆదర్శం



కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో పాల్గొన్న కుమ్మరి శాలివాహన సంఘ ప్రతినిధులు

పరవాడ: రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకురి మొల్ల జయంతిని గొర్లివానిపాలెం కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గొర్లి గోపీఅమ్మలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షుడు కొత్తూరు గెడ్డప్ప తదితరులు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్ గొర్లి గోపీఅమ్మలు మాట్లాడుతూ అగ్రవర్ణాలను ఎదిరించి చదువు కొనసాగించి రామాయణాన్ని రచించిన ఘనత మొల్లకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ డి.అర్జున వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎ.రామస్వామి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కె.కనకారావు, జిల్లా కార్యదర్శి భాస్కరరావు, అనకాపల్లి నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

‘ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం’



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో సునీత

పరవాడ : మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో ఎం.సునీత సిబ్బందిని హెచ్చరించారు. భర్నికం మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో సునీత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ పుస్తకాలు, మెనూకి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.కవిత పాల్గొన్నారు.

22న భావనారుషి, భద్రావతిల కల్యాణం



భావనారుషి, భద్రావతి కల్యాణ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : తోటాడ గ్రామంలో ఈ నెల 22న భావనారుషి, భద్రావతిల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ పురాతన భావనారుషి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. 22న రాత్రి 7 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందన్నారు. 23న ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. అదే రోజు స్వామి వారి పల్లకి ఊరేగింపు, ఊయల సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోటవురట్ల : కొత్త అమావాస్య పండగను పురస్కరించుకుని కె.వెంకటాపురంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు రిబ్బన్ కత్తిరించి టోర్నీ ప్రారంభించి తొలి బంతిని ఆడి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఏటా కొత్త అమావాస్య సందర్భంగా వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తుల అందరి సహకారంతో జరుగుతున్న టోర్నీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రామసత్యనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

కోటవురట్ల : కె.వెంకటాపురంలో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. హెచ్3ఎన్ వైరస్‌తో దగ్గు, జ్వరం, ఊపిరి సమస్యలు తలెత్తుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఫీవర్ సర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాలు, వ్యాధులపై ఆరా తీస్తున్నారు. దగ్గు, జ్వరం లక్షణాలున్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు.

ఈ రోడ్డుకు మరమ్మతులు చేయరూ..



గోతులమయంగా మారిన శంకరం-సబ్బవరం ప్రధాన రహదారి

అనకాపల్లిటౌన్ : మండలంలోని శంకరం- సబ్బవరం రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ రోడ్డులోనే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలున్నాయి. ఇలాంటి ప్రధాన రహదారిలో అడుగుకో గొయ్యి ఏర్పడింది. వాహనాలు పట్టుమని పది కిలోమీటర్ల వేగంతో కూడా ప్రయాణించలేని పరిస్థితి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు పెట్టుకోవడానికి వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు నిత్యం వివిధ పనులపై జిల్లా ప్రధాన అధికారుల కార్యాలయాలకు వచ్చేవారు చాలా మంది ఉంటారు. అలాంటి వారందరికీ ఈ రోడ్డు ప్రయాణం నరకం చూపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా స్థానికులు, వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చేవారు కోరుతున్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక



అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా బోడి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గొల్లవీధి శ్రీ సీతారామదేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా ఒమ్మి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మొల్లి రమణ, గోకువాడ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా గొలగాని సత్తిబాబు, కార్యదర్శులుగా గోకువాడ నాగేశ్వరరావు, బొట్ట చిన్న, కోశాధికారిగా కారుకొండ కన్నాయాదవ్, అధికార ప్రతినిధిగా కుండల రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా పళ్ల దుర్గారావు, సమన్వయకర్తగా గొలగాని అయ్యబాబుతో పాటు 13మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ కమిటీ మూడేళ్లపాటు మనుగడలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.